ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక (5.7.67)

# నాకూ మనస్సు ఉంది

"రాముా, నాకీ లెక్క చెప్పవూ?" రాధ పరుగున వచ్చింది.

ఆ పిల్ల తూలిపడకుండా చేతులతో అడ్డుకొని, "నెమ్మది రాధమ్మా, పడిపోతావు..." అన్నాడు రాము.

"పట్టుకోటానికి నువ్వున్నావుగా!" రాధ కిలకిలా నవ్వింది. చిలిపి బుగ్గలు సొట్టలు పడ్డాయి.

రాము చిన్నగా నవ్వాడు. "అల్లరి పిల్లవి... నీకేం తెలుసు, నీకు జ్వరం వచ్చినప్పటి నుంచి నాకంగారు! నీవలా స్పృహలేక పక్కమీద పడి ఉంటే నాకు నోట ముద్ద పోయేది కాదు. కంటికి నిద్రవచ్చేది కాదు.."

"నాకు తెలుసు. అమ్మ చెప్పింది. రాత్రి, పగలు అస్తమానం నువ్వు నా మంచం పక్కనే ఉండేవాడివిట కదూ! రాముా, నేనంటే నీకింత ఇష్టమా?"

రాధ కళ్ళల్లో కాంతి, సౌందర్యము, మాధుర్యము సుధ త్రివేణిలా పొంగి పొరలుతున్నాయి.

పదేళ్ళ పసితనపు పసిడి పలుకులు ఎవరిని పరవశింపజేయవు?

ఆ పిల్ల లేతవేళ్ళను నిమురుతూ రాము అన్నాడు. "దేవతలంటె, పూబాలలంటే ఎవరికిష్ట ముండదు రాధమ్మా! నువ్వు నా పాలిట దేవతవు.... ఈ దీనుడి మంచి చెడ్డలు చూసే ఆత్మీయురాలివి నువ్వు తప్ప నాకింకెవరున్నారు? నీ కళ్ళల్లోని కాంతి, నీ మాటల్లోని అమృతము నాకు ప్రాణదానం చెయ్యకపోతే నేనీపాటికేమైపోయేవాణ్ణి?..."

అమాయకమైన అదే మందహాసము ఆమెకు నిత్యనూతన వైభవము. "నువ్వు మాట్లాడు తుంటే బలే బావుంటుంది రామూ! ఏమిటేమిటో అంటుంటావు. అలా వినాలనిపిస్తుంది..."

"నా మాటలు అర్థం కాగల వయస్సు లేకపోయినా నా మనస్సు నీకు తెలుసును. అదే నా అదృష్టం!... అది సరే, నెల రోజుల నుంచి జ్వరంతో బాధపడ్డావు కదా! అప్పుడే పుస్తకాలా?..."

రాధ బుంగమూతి పెట్టింది. "బళ్ళో నాకుంటె అంతా ముందకు వెళ్ళిపోయారు. మరి నేను నేర్చుకోకపోతే ఎలా?.. నాకు చెప్పవూ? అన్న నాకు చెప్పడుకదా మరి!"

"సరే, ఇలాతే పుస్తకం..."

లెక్కలు చెప్పనారంభించాడు రాము. శిష్యురాలు లీనమైపోయింది!

పదహారేళ్ళ రాము ఇంజనీరి గోపాలరావుగారింట్లో నౌకరు. అంతకంటె సేవ చేసే యంత్రమనటం సబబు! ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు ఇంజనీర్ల ఆనవాయితీ ప్రకారం మస్టర్ రోలులోని ఎన్.ఎమ్.ఆర్. (ఇదేం డిగ్రీ కాదు!) మజ్దూర్‌ని ఇంట్లో చాకిరికి (పైగా హెడ్ కూలీగా ఎక్కువ రేటుకి వ్రాయించి) పెట్టుకున్నారు గోపాలరావు అనే ఎ.ఇ. గారు. నెలాఖరున సంతకం చేసేటప్పుడు తప్ప ఎప్పుడూ ఆఫీసు ముఖం చూసి ఎరగడు రాము అనే ఆ మజ్దూర్. ఆ జీతం డబ్బులెప్పుడూ అతని చేతికి రాలేదు.. ఎందుకు రాలేదని అడిగే అర్హత అతనికి లేదు. అవును – బానిసలు మనదేశంలోనూ ఉన్నారు!

నెలకి పది రూపాయల నోటు, రోజుకు రెండుపూటలా చల్లారిపోయి, మిగిలిపోయిన పదార్థాలతో భోజనం – ఇవి అతనికి ముట్టే ప్రతిఫలం! ఎ.ఇ. గారి కుటుంబంలోని వ్యక్తులు తినగా పారవేసిన పదార్థాలు, ఎంగిలి మెతుకులు తన కంచంలో తరుచుపడటం రాముకి తెలుసు. వారి పెంపుడు కుక్కకి నేతి బిస్కట్లు పెడతారన్న విషయం చెప్పటమిక్కడ సముచితం!

ఎ.ఇ. గారి తల్లి సాంబమ్మగారు రాము పాలిట సింహస్వప్నం, ఆవిడ కిష్టంలేని పనులు రాము అనే 'నౌకరు వెధవ" చాలా చేస్తూంటాడుట! ఉదయం ఐదుగంలకి లేచినది మొదలు దొడ్డి ఊడ్చి పాచిచెయ్యటం, గేదెను శుభ్రంగా కడిగి చిట్టు తవుడు అన్నీ కలిపి పెట్టి పాలు తీయటం, బండెడు అంట్లు తెల్లగా తోమటం (అప్పుడే కంపెనీ నుంచి తెచ్చిన సామానులా తోమినా సాంబమ్మగారికి తృప్తి ఉండదు!) ఇంటిల్లపాది బట్టలు తెల్లగా మల్లెపూవ్వుల్లా ఉతకడం, మధ్యాహ్నం టిఫినుకు ఏదో ఒక పప్పు రుబ్బటం, దొడ్లోమొక్కలికి బోదెలు త్రవ్వి నీళ్ళు పెట్టటం, తిరిగి సాయంత్రం అంట్లు తోమటం పాలు పితకటం, ఇల్లు ఊడ్చటం,

ఐసు క్రీములు, గులాబుజాములు తిని తిని అలిసిన ఆస్తిమంతుల శరీరాలకు విశ్రాంతి కోసం పాన్పులు అమర్చటం, రాత్రి అయ్యగారికి కాళ్ళు పట్టమూను! ఇన్ని చేసి అందరూ నిద్రించిన తరువాత అప్పుడు తనని గురించి ఆలోచించుకునే "ఆ నౌకరు వెధవ" ఏనాటికానాడు నీళ్ళు పోసుకుని శుచిగా ఉండటం, ఖాళీ సమయాల్లో చదువుకోవటం సహజంగా కొన్ని అభిరుచులు కలిగి ఉండటం - సాంబమ్మగారికి నచ్చని విషయాలు!.... అట్టే మాట్లాడితే మహాపరాధాలు! ఎందుచేత? వాడు వట్టి "నౌకరు వెధవ" కనుక!

నా అన్నవాళ్ళు లేని రాము చిన్నతనంలో తెలిసీ తెలియని వయస్సులో తల్లి చెప్పిన మాటలు మనస్సుల్లో పెట్టుకొని ఏదో ఒక విధంగా చదువుకొని పైకి రావాలని ఆశించాడు. బడిలో చదవకపోయినా కూలి డబ్బుల్లో మిగిల్చిన వాటితో పుస్తకాలు కొనుక్కుని తెల్ల కాగితాల మీద నోట్సులు వ్రాసుకొని అదే చదువుకొని ఏకలవ్యునిలా పైకి వచ్చాడు. తనకు తీరిక దొరికితే గేదె పాక పక్కన తన కివ్వబడిన కట్టెల గదిలో ఓ పక్కన కూర్చుని చదువు కుంటుంటాడు. అంతా నిద్రపోయాక రాత్రిళ్ళు వీధి పక్కన లాంతరు స్తంభం క్రింద కూర్చుని చదువుకుంటాడు.

ఎ.ఇ. గారి కుమార రత్నం వెంకటరత్నం. రాము ఈడువాడు. అప్పుడే ఓ దండయాత్ర చేశాడు. మళ్ళా ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలు వస్తున్నాయి. ఇంత వరకు పుస్తకం తెరిచిన పాపాన పోలేదు! తీరుబడి ఏది? రోజుకి రెండు కొత్త సినిమాలు, పూటకి రెండు కొత్త డిటెక్టివ్, శృంగార భయంకర రహస్యాల నవలలు విడుదలవుతున్న ఈ రోజుల్లో ఆధునిక విద్యార్థికి క్లాసు పుస్తకాల్లో తల దూర్చటం మాటలా మరి!

కుమార రత్నం అలా కొంప పీకుతూంటే "నౌకరు వెధవ" సమయం దొరికినప్పుడల్లా (అర్థరాత్రి అయినా వాడికి చదవటానికి హక్కులేదని సాంబమ్మగారి వాదం! నిజమే మరి, వాడు చదువుకొని పైకి వచ్చేస్తే తమ ఇంట్లో అన్నిటికి తల ఒగ్గి గొడ్డుచాకిరీచేసే వాళ్ళు దొరకొద్దూ?) చదువుకోవటం.. అందులో తెలివి తేటలతో ఆ కుమార రత్నంగారి చెల్లెలు రాధమ్మకే చదువు చెప్పటం ఎంత బాధ, ఎంత బాధ? ఎంత అవమానం? ఎంత ఇది? ఎంత అది?

"నువ్వు లెక్క చెబితే ఇట్టే అర్థమయిపోతుంది రామూ!"

"నాదేముందమ్మా! నువ్వు అర్థం చేసుకున్నావు కనుక అలా అనిపిస్తుంది... ఇక చాలు. మామ్మగారుచూస్తే..." ఆ దురదృష్టవంతుడి మాటలు పూర్తి కాలేదు. పిడుగుల వర్షం కురియనే కురిసింది!

"ఒరేయ్ రాలుగాయ వెధవా! నిన్ను తగలెయ్య!... నీకిదేం పాడుబుద్ధిరా? నువ్వా వెధవ పుస్తకాలు ముందేసుక్కూర్చుని మొన్న జబ్బు పడిన పిల్లని కూడా లాక్కుపోతావా? నీకెన్ని గుండెలు? నిన్ను మహమ్మాయం వండినా నీకు బుద్ధిరాదు..." సాంబమ్మగారి హుంకరింపులతో గజగజ వణికిపోయాడు రాము.

"మామ్మా! రాము పిలవలేదు..." రాధమ్మ నోరు మూసేసింది ఆవిడ.

"నువ్వు నోర్ముయ్యవే! లోపలికి పద... భడవకానా! ఎన్నిసార్లు చెప్పాను ఈ నౌకరు వెధవ దగ్గిరకు రావద్దని? వాడి బుద్ధులే రావటానికి..." అంటూ రాధని రెక్క పట్టుకొని అప్పుడే దొడ్లోకి వచ్చిన కోడలుసుశీల చేతుల్లో కుదేసి, అదే విసురుతో డీలాపడి నిలబడి పోయిన రాము మీద మళ్ళీ విరుచుకుపడింది ఆవిడ.

"ఏరా? పప్పు రుబ్బమని నేను చెబితే లార్డులా పుస్తకాలు పెట్టుక్కూర్చున్నావ్?"

"అమ్మగారిని అడిగితే పప్పు ఇంకా నానలేదన్నారమ్మా. అందాకా చదువుకుందామని."

"ఏం కలక్టరయి పోదామనుకుంటున్నావా? నెలయ్యేసరికి పదిరాళ్ళు పుచ్చుకోవటం లేదూ? రోజల్లా మప్పితంగా తినటంలేదూ? చేద్దామనుకునేవాడికీ ఇంట్లో పనే ఉండదూ? దొంగవేషాలు నువ్వూను. ఇంతకీ ఈ పుస్తకాల మూలానేగా ఇదంతా నీకు? ఉండు. రోగం కుదురుస్తాను... ఆ పుస్తకం ఇలాతే.." ఆవిడ చెయ్యి చాచింది.

"మామ్మగారూ, ఇంకెప్పుడూ చదవను. ఈ మాటుకి నన్ను క్షమించండి." రాముడి కళ్లల్లో నీళ్ళు ఆ మహాకాయాన్ని..... దానిలో వికృతమై రాక్షసమై కరుడుకట్టిన మనస్సుని కరిగించలేదు. అవిద్యావంతురాలయిన ఆమెకు ఒక అధికారికి తల్లిమాత్రం కాగలిగిన ఆమెకు ఒక పేదవాని చదువుకు కలిగే ఆటంకాలు ఎంత వ్యథ కలిగిస్తాయో ఎలా అర్థమవుతుంది?

అత్తగారి ఎడల అణకువ నోరు కట్టి వేసినా విద్యావంతురాలయిన సుశీల ఆ పరిస్థితికి చలించిపోయి నోరు పెగుల్చుకొనే లోపలే జరగకూడని దారుణకాండ జరిగిపోయింది!

ముక్కలు ముక్కలుగా చింపబడిన తన నోట్సు కాగితలు గాలిలో ఎగిరిపోతూ తన ప్రాణవాయువులనే కొనిపోతున్నట్లనిపించి కుప్పగా కూలబడిపోయాడు రాము.

ఆ విషాదాన్ని మాటల చేత భరింపచెయ్యటం వీలుకాని పని. సహనమనే సౌశీల్యాన్ని మూర్తీభవింపచేసుకున్న రాము భరించగలిగాడు! అదే ప్రకృతి ఆ జీవికిచ్చిన వరం!

● ● ●

నాలుగు రోజులు భారంగా గడిచాక ఓనాడు సాయంకాలం రాధ ఒంటరిగా కనపడింది.

"రామూ, బాధగా ఉందా?.. మామ్మ చింపివేసిన పుస్తకం నేను తెచ్చిపెడతాను? ఎక్కడ దొరుకుతుందో చెప్పు?" అని అడిగింది రాధ.

"రాధమ్మా!..." రాము కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. "అది వ్రాసుకున్న నోట్సు. బయట దొరకదమ్మా!" రాధ బిక్కముఖం పెట్టింది. రాము మెరిసే కళ్ళతో అన్నాడు. "రత్నం సైన్సు పుస్తకం ఓసారి తెచ్చి పెడతావా?.. రాత్రి కూర్చుని వ్రాసుకుని ఆ గది మూలగూట్లో పెట్టేస్తాను. రేపుపొద్దున్న నువ్వు లేవగానే తీసి మళ్ళీ అన్నయ్య పుస్తకాల్లో పెట్టేద్దువు గాని..."

"అలాగే!" రాముకి సహాయపడ కలుగుతున్నానన్న ఆనందం ఆ పిల్ల కళ్ళల్లో మెరిసింది.

నాలుగు రాత్రిళ్ళు కష్టపడి నోట్సు తయారు చేసుకున్నాడు రాము. ఈ సత్కార్యంలో చాటుగా సహకరించిన సహృదయ సుశీల అని రామూకి, రాధకు తెలియదు! తెల్లవారు

ఝామునే రాము గూట్లో పెట్టిన పుస్తకం రాధమ్మ పొద్దెక్కి లేచి చూసే సరికి కనిపించకపోయినా అది రత్నం పుస్తకాల్లోకి చేరిపోతూండేది. ఎవరా పుస్తకం జాగ్రత్తగా చేరవేస్తున్నారో తనకంతు పట్టకపోయినా తన పని రహస్యం కనుక ఊరుకుంది రాధ.

ఓనాడు తను మెట్రిక్ ఫీజు కట్టటానికని ఆరు నెలలుగా ఆదా చేసుకున్న డబ్బును లెక్క పెట్టుకున్నాడు రాము. సబ్బు ఎప్పుడూ వాడి ఎరుగడు. బట్టలు బేడ సోడాతో ఉతుక్కుంటాడు. నీళ్ళతోనే జుట్టు వంగదీసుకుని అణాదువ్వెనతో పగిలిన ఓ అద్దం పెంకులో చూసుకొని దువ్వుకుని శుచిగా ఉంటాడు. సినిమా, హోటలు - వినటమే కాని చూడలేదు. చేతిలో డబ్బు ఉన్నా, ఓక్కోసారి ఆకలి మండిపోతున్నా అణా బటానీలయినా కొనుక్కోలేదు. కూలిగా చేతికి వచ్చిన డబ్బుతో పుస్తకాలకు, ఒకటి రెండు బనీను గుడ్డలకు పోను తక్కినది పరీక్ష ఫీజుకని జాగ్రత్త చేసుకున్నాడు.

లెక్క పెట్టుకుంటే నలభై ఎనిమిది రూపాయలున్నాయి. ఇంక ఫీజు కట్టటానికి నాలుగు దినాల వ్యవధి ఉంది. నెలజీతం ఆ తరువాత కాని అందదు. ఫీజుకిక తక్కువయిన రెండు, అప్లికేషన్ వగైరా పంపటానికి ఖర్చు రెండు ఇక నాలుగు రూపాయలుంటే సరిపోతుంది. సుశీలమ్మగారి నడిగితే జీతంలో విరక్కోసుకోమంటే ఒప్పుకోకుండా ఉంటారా? ఏదో కొంత ధైర్యం కలిగింది.

కాని ఆ సాయంత్రమే మరునాడు తన పుట్టిన రోజుని రాధమ్మ చెప్పింది.

రాము ఆలోచనలో పడ్డాడు. రాధ తనకంటి వెలుగు. తన బ్రతుకుబాటపై ఆమె పరిచిన వెన్నెల. ఆమె సహాయమే శ్రీరామరక్ష. ఎప్పటికయినా అదే తన అభివృద్ధికి పట్టుకొమ్మ. ఆ కొమ్మ నాశ్రయించుకున్న తాను ఆమెకు శుభాన్ని ఆశించటం, ఈ వేడుకలో ఏదయినా కానుక ఇవ్వటం తన ధర్మం! రాము ఇక అప్పైన ఆలోచించలేదు. నేరుగా బజారుకిపోయి ఓ మురళీకృష్ణ ప్రతిమని ఆరు రూపాయలు పెట్టి కొన్నాడు. రాధకు కృష్ణ ప్రతిమ అత్యంత ప్రీతికరమని అతనికి తెలుసు.

ఇంటికి వస్తూనే సాంబమ్మగారు లేకుండా చూసి, 'అమ్మా, రాధమ్మకి బహుమతి తెచ్చాను. మీరు కోప్పడనంటే ఇద్దామని" అన్నాడు రాము.

సుశీల మందహాసం చేసింది. "మంచి పనికి ఎవరు మాత్రం కోప్పడగలరు రామూ?"

"అయితే మామ్మగారు నన్ను కోప్పడినప్పుడల్లా నేను చెడ్డ పని చేస్తున్నాననే మీ అభిప్రాయమా అమ్మా?" అని అడుగుదామనుకున్నాడు రాము. కాని, అది నిజం కాదని సుశీల ఆర్ద్ర నయనాలే అతనికి చెప్పాయి. "అయినా, ఇంత ఖరీదు పెట్టి ఎందుకు రామూ?" మందలించింది ఆమె.

రాము హాయిగా నవ్వాడు. "నా ఆనందం కోసం .... రాధమ్మ ఇలా వేయిసార్లు పుట్టిన రోజులు జరుపుకోవాలని నా కోరిక." అంటూ రాధ చేతుల్లో ఉంచాడు మురళీకృష్ణుణ్ణి. రాము కన్నీళ్ళను చొక్కా చేతులతో తుడుచుకుంటూ వెళ్ళిపోవటం ఆ పసిపిల్లకు అర్థం

కాకపోయినా అతని కోసం తామూ నీటిని నింపుకోగలమని సుశీలమ్మ కళ్ళకు తెలుసు! మనస్సున్న ఆమెకు మనుషుల మనస్సుల విలువ తెలుసు!

తిరిగి రాము, సమస్య మిగిలారు. అనుకోని ఖర్చుతో కావలసిన డబ్బు పది రూపాయలకు పెరిగింది. ఎలా అడగాలా అని నాలుగు రోజులు సతమతమయ్యాడు.

ఓ సాయంత్రం ఎవరూ లేకుండా చూసి, "అమ్మ గారూ!..." అని పిలిచాడు రాము.

అతని బెదురు కళ్ళు చూసింది ఆమె. "ఏం కావాలి రామూ?"

"నాకు అత్యవసరంగా పది రూపాయలు కావాలి. జీతం రాగానే మీకిచ్చేస్తాను. దయ ఉంచి ఎవ్వరికీ.."

వాడి ముఖం చూసే సరికి సుశీల మనస్సు కరిగిపోయింది. 'ఎందుకు - ఏమిటి' అన్న ప్రశ్నలు ఆమెలో ఉదయించలేదు. వెంటనే లోపలికి వెళ్ళి తెచ్చి ఇచ్చింది. రాము ముఖం వికసించింది. ఆనందభాష్పాలతో, 'మీ మేలు నా జన్మలో మరిచిపోలేనమ్మా!" అని ఆమె పాదాలంటి నమస్కరించి గబగబా తన కట్టెల గదివైపు వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు ఇంజనీరు గోపాలరావుగారు తమ డ్రాయింగు రూములో ఓ కంట్రాక్టరు మహాశయునితో బిజీగా వున్న సమయంలో రాము గదిలోకి వచ్చాడు. మంచి రాచకార్యంలో ఉండగా "ఆ పనికి మాలిన వెధవ" (ఇ.ఎ. గారి పరిభాషలో) బూట్లకి పాలిష్ చేయటానికి మామూలు వేళకి అక్కడికి వచ్చి ఉండవచ్చు!... కాని కంట్రాక్టరు ఇస్తున్న కానుక (ప్రభుత్వం దీనినే లంచం అంటుందిట!) అందుకుంటున్న ఎ.ఇ. గారికి ఉలికిపాటు కలగచేసిన రాము ఎంతయినా శిక్షార్హుడు కదా! "పోరా వెధవా, సమయాసమయాలు తెలియవు. తరువాత తగలడు" ఇవి వారి దీవెనలు.

ముకుళించిన ముఖంతో రాము వెనుదిరిగి వచ్చాడు. ఓ అరగంట వరకు మరో పని చేసుకుని అయ్యగారు, ఆయన అతిథివర్యుడు బయటకు వెళ్ళటం చూసి ఆ గదిలోకి వెళ్ళి పాలిష్ చెయ్యటం మొదలుపెట్టాడు.

మరికొన్ని క్షణాలకు ఏదో అలికిడయినట్లయి వెనక్కి చూశాడు. రత్నం డ్రాయరు సొరుగు లాగి ఏదో కాగితం జేబులో కుక్కుకొని కంగారుగా ఒక్క గంతులో గది దాటేశాడు. కిందుగా వంగి పాలిష్ చేస్తున్న రాముని అతను చూడలేదు.. ఏదో భయం నిలువునా చుట్టినా రాము నోరు తెరుచుకోలేదు. ఆ ఇంటిలో తన మాట కెంత విలువున్నదో రాముకి తెలుసు!

పని ముగించుకుని బయటికి వచ్చాడు. హాలులో గడియారం పదకొండు గంటలు కొట్టింది. శనివారం. బ్యాంకు గంటలో మూసేస్తారు. అప్లికేషన్ పంపటానికి ఆఖరి రోజు. ఈ ఒక్కగంట మీద తన యావద్భవిష్యత్తు ఆధారపడింది' అనుకున్నాడు రాము.

సుశీలమ్మగారితో చెబుదామంటే ఆవిడ ఎక్కడో పనిలో ఉన్నారు. సాంబమ్మగారితో చెబితే ఇక ఆశలేదు. ఇప్పుడిక బయట కబుర్లలో ఉన్న అయ్యగారు పలకనే పలకరు. అదీ గాక ఇది తనకు విశ్రాంతి సమయం. అరగంటలో పని పూర్తి చేసుకుని రావచ్చును. ఇదే

దృష్టిలో పెట్టుకొని గబగబ కొట్టు గదిలోకి వెళ్ళి పెట్టె తెరిచి తన దగ్గిర డబ్బంతా లెక్క చూసుకుని బయలుదేరాడు రాము.

నడిచి వెళ్ళాడనటం కన్న గాలిలో ఎగిరి వెళ్ళాడనవచ్చు. బాంకు గేటులో ఆఫీసు ప్యూను పలకరింపు కూడా వినిపించుకోలేదు రాము. ఉదయం నించి ఏమీ తినలేదు. నీరసంగా ఉంది. అయినా, ఇన్నేళ్ళుగా ఎదురు చూసిన క్షణం వచ్చింది. ఫీజు కట్టేస్తే ఇక ఏ బాధా ఉండదు. డిసెంబరులో మరో పాతిక కట్టాలి. అంతే. మార్చిలో పరీక్షలు.. మే నెలకి ఫలితాలు. తను విద్యావంతుడవుతాడు. మంచి ఉద్యోగం వస్తుంది. ఆపైన ... ఆ పైన...

అతని మధుర స్వప్నాలు రూపు ధరించలేదు. చేతికందిన బాంకు రసీదుతో పోస్టాఫీసుకి వెళ్ళబోతున్న రాముకి గుమ్మంలో మళ్ళీ ఎదురయ్యాడు ఆఫీసు ప్యూను.

“అయ్యగారు నిన్ను వెంటనే లాక్కురమ్మన్నారు.” కాంట్రాక్టరు పోయించిన కాఫీ నీళ్ళు ఎంత వదరుపోతుతనాన్నయినా నేర్పాయి ఆ ప్యూనుకి.

రాము తెల్లబోయాడు. “ఇప్పుడే అయిదు నిముషాల్లో పోస్టాఫీసుకి...”

“వీల్లేదు. వెంటనే రమ్మన్నారు” అని రాము రెక్క పట్టుకొని ఈడ్చుకు వచ్చాడు.

గోపాలరావుగారు చిందులు తొక్కుతున్నాడు. రాముని చూడగానే పోలికేకపెట్టాడు. “ఏరా? వంద రూపాయల నోటు ఏంచేశావ్.”

రాము ఉలిక్కిపడ్డాడు. “నాకేమీ తెలియదు బాబూ, మీరేమంటున్నారో” వాడి మాటలు పూర్తి కాలేదు. చెంప ఛెళ్ళుమంది. వాడి చేతుల్లోని బాంకు రశీదు, తదితర కాగితాలు లాక్కున్నాడు ఎ.ఇ. గారు.

అన్నీ పరీక్షించి, “ఏమీ తెలియదేం? ఇదంతా ఏమిటి? ఏభయి రూపాయలు ఫీజు కట్టే శావుగా! ఇలా దొంగకూడు తినకపోతే చావరాదూ? తక్కిన ఏభయ్యి ఏవి?” అని అరిచా డాయన.

రాము భయంతో కంపించిపోయాడు. అక్కడే విషాదమయ దృక్కులతో చూస్తున్న రాధ, సుశీల వైపు చూశాడు. వాళ్ళు నిస్సహాయులు. తన్నాదుకోలేరు. వాడి నోట మాట రాలేదు.

“వీడిలా చెప్పడురా! ముందా జేబులు చూడు.” ఎ.ఇ. గారి ఆజ్ఞ పరిపాలించిన ప్యూను రాము బట్టలు చిరిగిపోయేలా సర్రున లాగినా ఏ దారపు పోచలోను ఆ డబ్బు కనిపించలేదు. లాగు జేబులో రిజిస్ట్రేషన్‌కని కొన్న కవరు, స్టాంపులు మిగిలిన ఆస్తి నాలుగు అణాలు తప్ప మరేమీ లేదు. “ఏం చేశావురా రామిగా! చెప్పు... నిన్ను చంపేస్తాను లేకపోతే..” గోపాలరావు గారు అరిచాడు. అప్పటికే సగం చచ్చిన రాము కళ్ళల్లో నీళ్ళు రాలేదు. తన నడుముచుట్టూ వలయం తిరిగిన బెల్టు ఊడలాగి అది ముక్కలయ్యేవరకు, తన చేతులు నొప్పి పెట్టే వరకు, వాడి బుగ్గలు చీరుకుపోయి రక్తం చిమ్ముతున్నా, ఒళ్ళంతా వాతలతో బొబ్బ లెక్కుతున్నా, బట్టలు జీర్ణమై పేలికలుగా రాలుతున్నా ఏ కోశాన దయలేని గోపాలరావుగారు వాడి నూచకోత కోశాడు. నెత్తురుతో తడిసిన రాము శరీరం నిస్సత్తువగా కూలబడిపోయింది.

బాంకు రసీదు, అప్లికేషన్ ఫారాలు ముక్క ముక్కలుగా చింపి వాడి ముఖాన చిమ్మి, "దరిద్రపు వెధవా! మళ్ళీ వంద రూపాయలు తీసుకొని వచ్చేవరకు ఈ గడప తొక్కకు. మళ్ళీ కనిపిస్తే చంపేస్తాను. ఫో!" అని ఓ తోపుతో రాముని రెండు గిరికీలు కొట్టించి నేల కరుచుకునేలా చేశాడు. ఓ మూల సాంబమ్మగారి దండకం ఈ హింసాకాండకు అగ్నికి ఆజ్యంలా తోడయింది.

ఒళ్ళంతా హూనమయి, ప్రపంచంలోని శోకభారాన్నంతా తానే మోస్తున్నట్లు కృంగి పోయాడు రాము. ఎప్పుడూ ఎవరిమాట పడి ఎరగడు. ఇప్పుడీ అపవాదు మరణ సదృశమవుతూంది. ఈ అవమానాన్ని తొలగించుకోవాలంటే తనెలాగయినా వంద రూపా యల సంపాదించాలి. తనింక చదువుకొని పైకి వచ్చే ఆశ లేదు. కనీసం, ఈ మచ్చయినా మాపుకోకపోతే తనకిక బలవన్మరణం తప్ప గత్యంతరం లేదు.

రాము ఎలాంటి పనులు చేసి ఆ వంద రూపాయలు సంపాదించాడో చెప్పటం కన్న, ఆ పనులెంతగా అతనిని కుంగదీశాయో చెప్పటం సమంజసం! మంచినీళ్ళతో, టీ నీళ్ళతో కడుపు నింపుకొని తన సర్వశక్తుల్నీ ఇరవై నాలుగు గంటలు వినియోగించి, పదిహేను రోజుల్లో వంద రూపాయలు సంపాదించాడు రాము. రాళ్ళు కొట్టి, అడుసు తొక్కి, సరుకులు మోసి, బండిలాగి, రిక్షా ఈడ్చి రక్తాన్ని స్రవింప చెయ్యటానికి ఈ బతుక్కి ఎన్నిదారులు లేవూ? రక్తాశ్రువులు చిందించి, స్వేదంలో రక్తాన్నీ వెచ్చించి మిగిలిన ఎముకల పోగు రాము అనే రూపంలో డబ్బు తీసుకొని ఎ.ఇ. గారింటికి చేరింది.

సుశీల చూసి రాముని గుర్తు పట్టింది. గుండెలు విలవిలలాడగా కన్నీరు పెట్టింది. రాధమ్మ కౌగిలించుకొని ఏడ్చింది. సాంబమ్మ, గోపాలరావు స్థాణువులైపోయారు!

లోగొంతుకతో రాము మాటలు తడబడ్డాయి. "అయ్యగారూ, ఇవిగో వంద రూపాయలు ... రోజూ కూలిడబ్బులు చిల్లరగా వచ్చినవి. నోటుగా తేలేకపోయాను. మీరు నమ్మండి అయ్యగారూ! దొంగిలించలేదు. ఈ చేతులతో కష్టించి..." ఆ పై మాట్లాడలేక ఆ నాణాలు గోపాలరావు కాళ్ళవద్ద బోర్లించాడు రాము.

వేరే జేబులోని చిల్లర సుశీల ముందు ఉంచి, "అమ్మగారూ, ఇవి మీ దగ్గిర అప్పుగా పుచ్చుకున్న పది రూపాయలు. నిజం, అమ్మగారూ! నేనే దొంగతనం చెయ్యలేదు. కూలితో మిగుల్చుకున్న డబ్బుతో ఫీజు కట్టాను. నేను చదువుకోవలానుకున్నాను. అంతే నమ్మా నా తప్పు.. దొంగతనం చేసి కాదండమ్మా! నాకూ మనస్సు ఉంది... చెప్పమ్మా! రాధమ్మా! నేను మంచివాణ్ణి కాదూ? నాకు హృదయం లేదూ?" రాధమ్మ చేతుల్లో అలానే కుప్పగా కూలిపోయాడు రాము.

రాము వెళ్ళిపోయిన మరునాడే నిజం తెలుసుకుందామని కట్టెల గదిలోకి వెళ్ళిన సుశీలకు రాము వ్రాసుకునే నోటు పుస్తకం అతని నిర్మల చరిత్రను, హృదయ విదారకంగా విప్పి చెప్పింది. అక్కడక్కడ వ్రాయబడిన వాక్యాలు గుండెల్ని చీలుస్తున్నాయి.

"…..రాధమ్మ నా అదృష్టదేవత. ఎవరికీ తెలియకుండా సైన్సు పుస్తకం తెచ్చి ఇచ్చింది".

"ఈ వేళ రాధమ్మ పుట్టిన రోజు. కృతజ్ఞతగా మురళీకృష్ణుణ్ణి కానుకగా ఇచ్చాను. ఎంత ఆనందమయిందని నాకు! నాజీవితంలో ఇంత తృప్తి నేనెన్నడూ పొందలేదు."

"ఫీజుకిక పదిరూపాయలు తక్కువయ్యాయి. సుశీలమ్మగారి నడగాలి. ఆమె చాలా మంచివారు. నా కోరిక తప్పక తీర్చకుండా ఉంటారా?"

"అమ్మగారు పది రూపాయలు ఇచ్చారు. ఆమె కళ్ళల్లో తల్లి ప్రేమ తొణికిసలాడుతుంది. ఆమె అండ ఉంటే ఎన్ని కష్టాలయినా భరించవచ్చును. అయినా జీతం అందగానే ఆ పది రూపాయలు తిరిగి ఇచ్చెయ్యాలి."

ఒక్క చీకిన లాగు, చిరిగిన చొక్కా, పది పన్నెండు నోట్సు పుస్తకాలు, మిగిలిన దువ్వెన, పగిలిన అద్దం పెంకు, రెండు కొవ్వొత్తులు … ఇవి ఆ నిర్భాగ్యుడి ఆస్తి. వాటిల్లో ఓ మాణిక్యం మసిపూయబడి ఉందని సుశీల గ్రహించిన క్షణంలో ఆమె గుండెలవిసిపోయాయి.

అదే సమయంలో తెలిసింది రత్నం పోలీసుల చేతుల్లో పడ్డాడని!

కంట్రాక్టరు ఎవరిచేతనయితేనేం మోసగింపబడి తన పని కోసం దొంగనోట్లో ఎ.ఇ. గారికిచ్చాడు. ఆయన సొరుగులో దాచితే వాటిల్లోంచి లెక్క పత్రం ఉండదన్న ధీమాతో ఒకటి దొంగిలించి అది మార్చబోయాడు కుమారరత్నం. తెర తొలగిస్తే అన్నీ కంతలే! తీగ కదిలితే డొంకంతా కదులుతుంది. నేరస్థుడయినా కన్నకొడుకు కనుక పలుకబడితో రక్షించు కున్నారు ఎ.ఇ. గారు. అందరూ తోడు దొంగలే. మళ్ళీ ఆ నోట్ల ప్రసక్తి రాలేదు.

కాని, అందరి అన్యాయాలకు బలి అయిపోయిన నిష్కళంకుడు, నిర్మల స్వభావుడు అయిన రాము, అనాథుడు, నౌకరు అయినంత మాత్రాన ఇంతగా శిక్షింపబడడం ఎంత దారుణం?

ఇప్పుడు రాము ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పగలిగేది?

"నాకు హృదయం లేదూ?" అని రాము అడిగాడు. ఉందని ఇప్పుడంతా అంటారు. కాని, ఇదివరకు లేక ఇప్పుడు వేరే వచ్చి పడలేదు. అంటే, అది గుర్తించిన వాళ్ళకే ఇదివరకు లేకపోయింది. ఇప్పుడతని బలిదానంతో వారిలో హృదయ కవాటాలు తెరుచుకున్నాయి అన్నది నిజం!

చేతులు కాలిన తరువాత ఎన్ని ఆకులయితే మాత్రం గాయాన్ని మాన్పగలవు? రాము తెచ్చిన వంద రూపాయలతో ఎ.ఇ. గారు సంపాదించిన ఎన్ని వేలు సరితూగగలవు? అటువంటి ఎన్ని వేలయినా……… సమయం మించిపోయాక అమూల్యమైన ప్రాణాన్ని రక్షించగలవా?

వ్యక్తి మనుగడలోని విలువని గుర్తించక అంతస్తుల బందిఖానాల్లో తరతమ భేదాల సంకెళ్ళల్లో అవినీతిని భోంచేసి వ్యక్తులకు మానవత్వం ఔన్నత్యం అర్థం కాదు!

●